క్లుప్తంగా

సమ్మర్ క్రికెట్ క్యాంపు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: క్రికెట్ క్రీడాకారులు సమ్మర్‌లో నిర్వహించే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోడ్‌లో శనివారం సమ్మర్ క్రికెట్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు బి.విజయసారథి, కోచ్‌లు కుమార్, వినయ్, సలహాదారుడు పెరుగు కుమార్, శ్రీనివాస్, సెక్రెటరీ నవీన్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలాజీకి డాక్టరేట్



గూడూరు: మండలంలోని దామరవంచ గిరిజన బాలుర గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హట్కర్ బాలాజీకి శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎం.రాములు డాక్టరేట్ ప్రకటించారు. 'ఏ కంపరేటీవ్ స్టడీ ఎమాంగ్ ట్రిబల్ అండ్ నాన్ ట్రిబల్ హైయ్యర్ సెకండరీ స్టూడెంట్స్ ఇన్ దేయిర్ కెరీర్ అవర్నేస్ అండ్ అకాడమి మోటివేషన్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేశాడు.

ఎమ్మెల్యే కారు తనిఖీ

గూడూరు: ఎంపీ ఎన్నికల కోడ్‌లో భాగంగా శనివారం ఎమ్మెల్యే మురళీనాయక్ కారును గూడూరు పోలీసులు తనిఖీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా తనిఖీ చేయడం జరిగిందని ఎస్సై సీహెచ్. నగేష్ తెలిపారు.

తనిఖీలు ముమ్మరం

డోర్నకల్: ఎలాంటి పత్రాలు లేని డబ్బుతోపాటు మద్యం, గుడుంబా, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. స్థానిక అమ్మపాలెం క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీ నిర్వహించారు.

గడువు పెంపు

నెహ్రూసెంటర్: సీతారాముల కల్యాణ మహోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్టీసీ డీపో మేనేజర్ ఎం.శివప్రసాద్ శనివారం తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 91542 98768 సంప్రదించాలన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మహబూబాబాద్: ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి మరియన్న అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పలు శాఖల సిబ్బందితో జిల్లా కేంద్రంలో శనివారం ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మరియన్న మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ వరలక్ష్మి, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని కాచిరాజుగూడెం శివారు వాల్యాతండా వద్ద యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన తరుణ్ డిగ్రీ వరకు చదువుకుని ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పని చేయకపోవడంతో తల్లిదండ్రులు ఉద్యోగాలకు సిద్ధం కావాలని సూచించారు. అయితే, మద్యానికి బానిసైన తరుణ్ ఈనెల15న వాల్యాతండా వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

పాఠశాల మధ్యలోనే వెళ్లిన ఉపాధ్యాయులు

నెల్లికుదురు: పిల్లలకు పరీక్షలు జరుగుతున్నప్పటికీ సమయ పాలన పాటించకుండా ఉపాధ్యాయులు మధ్యలోనే వెళ్లి పోయిన సంఘటన మండలంలోని మేచరాజుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంతో కలిపి మొత్తం 10మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పిల్లలకు పరీక్షలు జరుగుతున్నప్పటికీ 3.15గంటలకు ఉండాల్సిన ఐదుగురు ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12గంటలకే పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిపోయారు. డీఈఓ, ఎంఈఓ, హెచ్ఎం పర్యవేక్షణ కొరవడడంతోనే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో హెచ్ఎం కూడా లేడేంటి అని అక్కడున్న వారు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే హెచ్ఎం మేడం డీఈఓ ఆఫీసుకు వెళ్లారని తెలిపారు.

అంగన్‌వాడీల్లో 'ప్రీ స్కూల్ డే' వేడుకలు

మరిపెడ రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, పాటలు, పౌష్టికాహారం అందిస్తూ వారి భవిష్యత్‌కు గట్టి పునాదులుగా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తాయని సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మరిపెడ మండలం తాళ్లఊకల్ సెక్టార్‌లోని పాంబండతండా అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ కొంపెల్లి శైలజ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే (ఈసీసీఈ) శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అజ్మీరతండా, పాంబండతండా జీపీ కార్యదర్శులు గుగులోతు రామోజీ, ఎర్ర రవి, అంగన్‌వాడీల టీచర్లు స్వర్ణ, రోజా, రాజశ్రీ, సులోచన, రేణుక, విజయలక్ష్మి, సబిత, విజయ, అచ్చమ్మ పాల్గొన్నారు.

గార్ల: గార్లలోని దంపకం బజారు అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో చదువుకొని 6 సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే ముందు కేంద్రాల్లో పిల్లలకు ఈ కార్యక్రమం చేపడతారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంపూర్ణ, టీచర్ పిడమర్తి సరిత తెలిపారు. ఈసందర్భంగా పిల్లలకు, డిగ్రీ పట్టాలు పొందే విద్యార్థుల అవతారంలో దుస్తులు ధరించారు.

కేసముద్రం: మండలంలోని మహమూద్ పట్నం గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో ఆటపాటల ద్వారా పిల్లలకు విద్యను అందించినట్లు ఆమె తెలిపారు.



మరిపెడ రూరల్: వేడుకల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు



గార్ల: దంపకం బజారు అంగన్‌వాడీ కేంద్రంలో..



కేసముద్రం: మహమూద్ పట్నం అంగన్‌వాడీ కేంద్రంలో..

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

● ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందనే నిజాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మానుకోట జనజాతర బహిరంగ సభలో చెప్పడం ప్రజలు సంతోషించారని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మానుకోటలో జరిగిన జనజాతర సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పది సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క మాట నిలుపుకోలేదన్నారు. రెండు పార్టీలు తోడు దొంగల్లాగా కుమ్మక్కై దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో మానుకోట ఎంపీగా బలరాం నాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని, అందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్నయాదవ్, నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మధుగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, కొమ్మాలు, యాకయ్య, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

బీజేపీని విమర్శించడం తగదు

గూడూరు: జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీని బోడి, కేడీ అని మాట్లాడడం సమంజసం కాదని బీజేపీ జిల్లా నాయకుడు మేరెడ్డి సురేందర్, మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శ్రీశైలం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గంజాయి, కల్తీ కల్లు నిర్మూలనపై ప్రచారం

మహబూబాబాద్ రూరల్: గంజాయి, కల్తీ కల్లును నిర్మూలిద్దాం.. మన సమాజాన్ని కాపాడుకుందాం.. అంటూ తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రచార పోస్టర్లను సంబంధిత అధికారులు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతికించారు. గంజాయి, కల్తీ కల్లుపై సమాచారం ఇవ్వాలనుకుంటే టోల్ ఫ్రీ నంబరు 87126 71111 కాల్ చేయాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న దయాకర్‌రావు

పెద్దవంగర: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. 22న సుధీర్‌కుమార్ నామినేషన్ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం చేపట్టారు. ఈ సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సమన్వయంతో కలసి కట్టుగా పనిచేసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు వేణు నాన్నమ్మ దుంపల నీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు సమ్మయ్య, శ్రీరాం రాము, పటేల్ నాయక్, కృష్ణమూర్తి శర్మ, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు హరీశ్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కేసముద్రం: మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ, ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మొదటి విడత లైబ్రరీ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుకునే వయస్సులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు నరేందర్, చీకటి వెంకట్రాంనర్సయ్య, రాజేంద్రాచారి, బాలశౌరీరెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేందర్, బిక్షపతి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న అశోక్

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యుత్ వినియోగంపై వివరిస్తున్న ఎస్ఈ

బయ్యారం: విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాలు తప్పుతాయని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జె.నరేష్ అన్నారు. మండలంలోని నామాలపాడులోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్ గీత, విద్యుత్ అధికారులు సంతోష్, శ్రీకాంత్, విజయ్, మధుసూదన్, సునీతాదేవి, ఇందిరా, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

● అడుగంటుతున్న భూగర్భ జలాలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉపల్లెపల్లి రెవెన్యూ పరిధిలోని భూక్యతండా, లూనావత్‌తండా గ్రామ పంచాయతీ సమీపంలోని ఆకేరు వాగు ర్యాంప్ నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. చుట్టూ ఉన్న వీరారం, విస్సంపల్లి, ఎల్లంపేట, మరిపెడ, ఉల్లెపల్లి తదితర గ్రామాలతోపాటు గిరిజన తండాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా రేయింబవళ్లు ఇసుకను తరలిస్తూ ఆకురు వాగు వట్టిపోయేలా చేస్తున్నారు. ఒక్కొక్క ట్రిక్కు ఇసుక రూ.5వేలకు విక్రయిస్తు లక్షల రూపాయలు దండుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఓ అధికారి అండదండలతోనే ఈ ఇసుక దందా నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు నెలలుగా ఈ అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరుకాయల చందంగా కొనసాగుతుంది. ఇసుక తరలించే ట్రాక్టర్లకు కనీసం నంబర్ పేట్స్ లేకపోవడం గమనార్హం. నంబర్ ప్లేట్స్ లేని ట్రాక్టర్లను అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తేజావత్‌తండాకు చెందిన ఓ ఇద్దరి వ్యక్తులు ఇసుక దందాకు తెరలేపి ఈ తతంగం అంతా నడుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఇసుక తరలిస్తున్న నంబర్ పేట్లు లేని ట్రాక్టర్లను సీజ్ చేయడంతోపాటు సంబంధిత ఇసుక అక్రమార్కులపై కఠిన చర్య తీసుకోవాలని ఆకేరు వాగు పరివాహక ప్రాంత రైతులు, ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఇసుక తరలిస్తున్న నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్

బడుగు, బలహీన వర్గాలు బీజేపీ వైపే..

మహబూబాబాద్ అర్బన్: రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంపై సీఎం రేవంత్ రెడ్డి సాక్షాత్తూ భద్రాచలం రాములోరి మీద ప్రమాణం చేసి చెప్పడం ఏమిటని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం మానుకోట పార్లమెంట్ స్థాయి ఎస్సీ మోర్చా సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే చెత్తకుప్పలో వేసినట్లేనని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మానుకోటకు చేరుకుని 1.45 గంటల పాటు బస్సులో వేచి ఉండాల్సిన పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. తనను ఎంపీగా గెలిపించాలని సీతారాంనాయక్ కోరాడు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయేందర్, ప్రధాన కార్యదర్శులు సంజయ్, రాంచందర్, గుగ్గిళ్ల పీరయ్య, వెంకటేశ్వర్లు, రాంచందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

తొర్రూరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపు కోసం మరో ఇరవై రెండు రోజులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని తొర్రూరు రూరల్ ఎన్నికల ఇన్‌చార్జ్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా అరూరి రమేష్‌ను గెలిపించేందుకు చేపట్టనున్న ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని 29 గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పదేళ్లుగా ప్రధాని మోదీ చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు పూసాల శ్రీమాన్, పల్లె కుమార్, రచ్చ కుమార్, కస్తూరి పులేందర్, బొచ్చు సురేష్, కొండ యాకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్/కురవి: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్, ఆర్టీసీ కాలనీ, అనంతారం, రాంసింగ్ తండా, కురవి మండలంలోని కురవి, పెద్దతండా గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ జి.చిరంజీవి, ఎస్టీఎఫ్ సీఐ పి.బిక్షారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్, వరంగల్, మహబూబాబాద్ ఎక్సైజ్ టీంలు సంయుక్తంగా విస్తృత దాడులు జరిపారు. ఈ దాడుల్లో 8మందిని అరెస్టు చేసి, 13 కేసులు నమోదు చేశారు. 400కిలోల బెల్లం, 180 లీటర్ల గుడుంబా, 40కిలోల పటిక స్వాధీనం చేసుకుని, 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. కురవి మండలానికి చెందిన బాదావత్ రాధా, మల్యాల వసంత, గంగరబోయిన లక్ష్మి, బుడుమ వీరమ్మ, పెద్ద తండాకు చెందిన గుగులోతు నందు, గుగులోతు అచ్చమ్మ, జంగా వెంకటమ్మ, ఎడ్ల ఎల్లాబాయిని అరెస్టు చేశారు. మహబూబాబాద్, కురవి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్

మండలంలో వరంగల్ నిఘా విభాగం, టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది గుడుంబా స్థావరాలపై సంయుక్త దాడులు నిర్వహించారని ఎక్సైజ్ సీఐ చిరంజీవి శనివారం తెలిపారు. దాడుల్లో పట్టుబడిన నిందితులు జంగా వెంకటమ్మ, అజ్మీరా శ్రీను నుంచి సుమారు ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మళ్లీ నేరం చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండేందుకుగాను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, రవికుమార్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు

సంక్షిప్త సమాచారం

బీజేపీలో చేరికలు

తొర్రూరు: మండలంలోని చింతలపెల్లి, హచ్చు తండాలకు చెందిన యువకులు డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో రాష్ట్ర నాయకుడు లేగా రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో శనివారం చేరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమాన్, శ్రీనివాస్‌రెడ్డి, పల్లె కుమార్, రచ్చ కుమార్, పులేందర్ పాల్గొన్నారు.

సన్మానం

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కళావతిబాయి, రామకృష్ణ, ప్రసాద్, షైముద్దీన్, రాజేందర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామంలోని రైతువేదిక భవనంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమ్మెట శ్రీను, మాళోత్ సర్వాన్, కుమ్మరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రూ.600 కూలి చెల్లించాలి

నెల్లికుదురు: ఉపాధి హామీ పథకంలో కూలీలు చేస్తున్న పనులకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 చెల్లించాలని సీపీఎం మండల నాయకుడు ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం ఉపాధి పని ప్రదేశంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఏఓ వెన్నం సత్యనారాయణరెడ్డి సతీమణి వెన్నం సుజాత అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చంద్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక సాయిశంకర్ శనివారం సుజాత మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా కేవీపీఎస్, గిరిజన సంఘం, వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే జన జాతర సభను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, యమగాని వెంకన్న, హరినాయక్ శనివారం తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తివేత

గూడూరు: కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల ఉల్లంఘనపై పార్టీ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు పార్టీ డీఏసీ చైర్మన్, వ్యవసాయ శాఖా మంత్రి జి.చిన్నారెడ్డి ఈనెల 9వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు సస్పెన్షన్‌కు గురైన నూనావత్ రమేష్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలిటెక్నిక్ పుస్తకాల పంపిణీ

కేసముద్రం: మండలంలోని మహమూద్‌పట్నం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలిటెక్నిక్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం కెరీర్ గైడెన్స్, ఐఐటీ, జేఈఈపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సుమన్, హెచ్ఎం నీలిమ, అరుణ, దుర్గ, లక్ష్మీ, రాధిక, అర్చన, సుష్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలి



పెద్దవంగర: విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని హెచ్ఎం పూసల శిరీష అన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా శనివారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో విద్యా సామగ్రి, క్రీడా వస్తువులు అందజేశారు.

బహిష్కరణ ప్రకటన హాస్యాస్పదం

బయ్యారం: ఏఐకేఎంఎస్ నుంచి తమను బహిష్కరించినట్లు చీలికవర్గం నాయకులు ప్రకటించటం హాస్యాస్పదమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ న్యూడెమోక్రసీతో తెగతెంపులు చేసుకొని వెళ్లిన వారికి తమను బహిష్కరించే హక్కు లేదన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కురవి: మండలంలోని నల్లెల్ల శివారు సూర్య తండాలో శనివారం నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్‌జానిమియా, దీరావత్ దస్రు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జెరిపోతుల మహేష్ తెలిపాడు.

ఘనంగా బోగ్‌బండారో

కురవి: మండలంలోని కొత్తూరు(జి) గ్రామ శివారు బంచరాయితండాలో శనివారం ఘనంగా మాలుసాదు ఆధ్వర్యంలో బోగ్‌బండారో ఘనంగా నిర్వహించారు.

చిన్నారులకు ప్రాథమిక విద్యనందించాలి

గూడూరు: తల్లిదండ్రులు తమ చిన్నారులకు ప్రాథమిక విద్యనందించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ వరలక్ష్మి అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు.

గ్రామస్తులకు వ్యతిరేకంగా గుడి ఏర్పాట్లు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గాలివారి గూడెం గ్రామానికి చెందిన భూస్వామి కొవ్వూరు వెంకట్‌రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే గ్రామ దేవత అయిన ముత్యాలమ్మ గుడి ఏర్పాట్లు చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన పలువురు గ్రామపెద్దలు ఆరోపించారు. ఈమేరకు శనివారం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం ఎదుట పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాంబాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సభ పైకి రానివ్వకుండా అవమానించారు



గూడూరు: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో తాను దళితుడనని సభా ప్రాంగణం పైకి రానివ్వకుండా అవమానించారని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను చిన్ననాటి నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంత కృషి చేశానో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌కు, జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డికి తెలుసు అన్నాడు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు కత్తి స్వామి తెలిపాడు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, యాకాంబ్రం, శివ, సతీష్ పాల్గొన్నారు.